


# తెగని తీగెలు

రచన :
శ్రీమతి గుత్తుర్తి ఈశ్వరీ సోమేశ్.

**(3)**

(గత సంచిక తరువాయి)

కాలం ఎవరికోసం ఆగదు. తెల్లవారింది. ఆ రాత్రి యెక్కడెక్కడో గడిపినా, తప్పదుకదా అని శ్రీధర్ బాధపడుతూనే ఇంటికి చేరుకున్నాడు.

జగన్నాథంగారు కోపోద్రేకంతో శ్రీధర్‌పై విరుచుకుపడ్తూ, "యేంరా శ్రీధర్! తండ్రిలేనివాడవని, యేదో కాస్తో కూస్తో మేనల్లుడవని దయదలచి చదివిస్తుంటే, యేమిటి నీ అహంకారం? చాల్రా నీ ఉపకారం! యింతటితో ఆపి నీ పెట్టెబేడా తీసుకొని తక్షణమే వెళ్ళిపో..." అంటూ కొట్టలేదుగాని అంతకంటె ఎక్కువ బుసలు కొట్టారు.

శ్రీధర్ ఆత్మాభిమానం దెబ్బతింది. చరచరా గదిలోకి వెళ్ళి తనకనిపించుకున్న బుక్స్ వగైరాలు పెట్టెలో కుక్కి పైకి నడిచాడు. ద్వారంవద్ద నిర్మల, జానకమ్మ జాలిగా శ్రీధర్ వంక చూస్తున్నారు, "అత్తయ్యా! వెళ్ళొస్తాను" అని మొహం సమంగా చూపకుండానే వెళ్ళిపోయాడు.

నిర్మల, తల్లిహృదయంపై వాలిపోయి, "అమ్మా శ్రీధర్‌ను వెళ్ళొద్దని చెప్పమ్మా!" అంది. శ్రీధర్ మీద గల ప్రేమ చంపుకోలేక,

జగన్నాథంగారి హుకుం అడ్డులేకుండా అమలు జరిగింది.

◆ ◆ ◆

శ్రీధర్ కాకినాడకు నాలుగు కిలోమీటర్ల దూరంలో వున్న సొంతవూరు చేరుకున్నాడు. జరిగిన విషయం తల్లితో చెప్పలేదు. రత్నమ్మ ముందే క్షయవ్యాధితో కూడిన రోగిష్టిమనిషి. విడువని ఆత్మీయుడులా రత్నమ్మను మంచం తోడైంది. యీ విషయం అంతా తల్లితో చెప్తే యేం విషమిస్తుందోనని మనసులోనే దాచుకున్నాడు.

సెలవులు గడిచాయి.

రోజూ శ్రీధర్ కాలేజికి వెళ్ళొస్తున్నాడు. కొడుకు తీరును చూసి, "బాబూ! కాలేజికెళ్ళి, యిక్కడకే రోజూ వచ్చేస్తున్నావు. మీ మావయ్యగారు అక్కడుం

డంలేదా-?" రత్నమ్మ అడిగింది.

"వారికి కాకినాడనుండి బదిలీ అయింది. నా చదువు యీ ఒక్క సంవత్సరమే కదా! అని వేరొక చోట బస పెట్టలేక యింటికి వచ్చేస్తున్నాను" అని చిన్నకట్టుకథ అల్లి గండం గడిచిందనుకున్నాడు.

"బాబూ! యీ యేడాది డబ్బు యిబ్బంది చాలా వుంది. మొన్ననే అప్పుచేసి, ఇంటికి కమ్మ వేయించాను" పరిస్థితిని బరువుగా తెలియపర్చింది.

తల్లిఅన్నట్లుగానే శ్రీధర్ కాలేజి ఫీజులకి, బుక్స్‌కి చాల బాధపడవలసి వస్తుందని గ్రహించి, పగలు కాలేజికి వెళ్తూ, రాత్రుళ్ళు కాకినాడ టౌన్ ఎంపోరియంలో మెసంజరుగా జాయిన్ అయ్యాడు. అప్పటికే మాసింది గడ్డం. చిరిగిన కళ్ళచొక్కా నీకు నేను తోడున్నానంది.

అయినా శ్రీధర్ తన మంచిని విడువలేదు. ఆ వూళ్ళో కుర్రాళ్ళందరను సమకూర్చి సంఘాన్ని నడుపుతున్నాడు. ప్రతి చిన్నపెద్దలకు ఆ సంఘంయొక్క ఆదేశాలను బోధించి, మంచిని సంపాదించాడు.

శ్రీధర్ మంచివాడుగా గుర్తింపబడడంతో అడుగడుగునా గ్రామ పెద్దలకు అడ్డుతగలడంవలన కొందరకు తిరుగుబోతుగా యెంచబడ్డాడు.

గ్రామపెద్దలతో చెయ్యి కలిపిన రంగశెట్టి, తహశీల్దార్ యిచ్చిన బియ్యం పరిమిట్‌ను విడిపించి తెచ్చాడు. ఒకబస్తా బియ్యమే విప్పి ఇంటికి ఒక కేజీ చొప్పున పంచి యిచ్చాడు. అడగనివాళ్ళకు లేనేలేకుండా చేసి, కోటా బియ్యం అయిపోయాయని చెప్పాడు.

ఈ అక్రమాన్ని శ్రీధర్ చూడలేక పదిమందిని కూడబెట్టి; ప్రసిడెంటు, కర్ణం, మునసబుల వద్దకువెళ్ళి అడిగారు. వాళ్ళకు అందులో శేషం ముడుతుందనే ఆశతో అయిపోయాయని చెప్పారు. ఆ మాటకు తిరుగులేదన్నట్టుంది వాళ్ళ అహంభావం. శ్రీధర్ అంతటితో విడువలేక పెద్దలపై నిఘా వేసుకొని ఆచూకీలు తీస్తున్నాడు.

రంగశెట్టి వూరుచివర పిండిమిల్లులో దాచిన పందొమ్మిది బియ్యం బస్తాలు గూడుబండిలో వేయించుకొని అమ్మేందుకై కాకినాడ వెళ్ళడానికి సిద్ధంగా వున్నాడు.

శ్రీధర్ వూళ్ళో రైతులను పోగుచేసి, పిండిమిల్లు వద్దకు తీసుకొచ్చాడు. అందరిలోను ఆవేశం పెరిగింది. రంగశెట్టి మిగిలిన గ్రహాలవద్దకు పరుగుతీసాడు. బియ్యం బస్తాలతో నున్న గూడుబండిని వూళ్ళోకి మళ్ళించారు.

శ్రీధర్ బియ్యం కోటా రేటు చొప్పున లిస్టుతయారు చేసి, కుటుంబ సభ్యులను బట్టి యింటికి ఇన్నికేజీలని నిర్ణయించి అమ్మేసాడు. ఆ డబ్బే గ్రామపెద్దలకు దక్కింది. పరువు పోయింది. పగను మాత్రం శ్రీధర్ చుట్టూ సాలెగూడుగా నలుప్రక్కల నుండి అల్లుకొస్తున్నారు.

LPC



ఎల్. పి. సి. మోనోబ్లాకు రెండు స్టేజి డీప్‌వెల్

- జెట్ పంపులు ! -

రెండుస్టేజి పంపులు ఎక్కువుగా అతిప్రెషర్‌లో సాదారణ జెట్ పంపుకన్నా నీళ్ళ నందించును.

ఎంత లోతైన బావినుంచి అయినా సరే మా మోనోబ్లాకు జెట్ పంపు సెట్టులు అతిసులువుగా మీకు నీళ్ళు అందించును.

½ H.P. నుంచి 5 H.P. వరకు దొరకును.

________ : వివరములకు : ________

Grams: "NAIDUBROS" Phone: Office: 22409 Works; 22757

THE EL-P-EM INDUSTRIALS

393, Mettupalayam Road (P.B. No. 1053) COIMBATORE-641002

తర్వాత గోధుమ, పంచదార కోటాల్లో కూడ శ్రీధర్ అన్యాయం జరగనీయులేదు. బీదరైతులంతా శ్రీధర్ పక్షాన్నే తిరుగుతున్నారు.

పండుగ సమయం వచ్చింది, 'బౌన్ ఎంపోరియం'లో అమ్మకాలు ఎక్కువగా వున్నాయి. ఒకరోజు సాయంత్రం శ్రీధర్ రాగానే మానేజర్ ఒకపాకెట్, బిల్లు అందించి–" శ్రీధర్! యిందాక ఎ.సి.టి.ఒ. జగన్నాథం గారు ఫోన్ ద్వారా యీ సామాను పంపమన్నారు. వెళ్ళి వాళ్ళింటికిచ్చిరా–! అని చెప్పాడు.

శ్రీధర్ ఆ యింటికెళ్ళేందుకు బాధనిపించింది. యజమాని చెప్పినపని చేయకతప్పదని భావించి, విధిని నిర్వహిస్తూ సైకిలెక్కాడు.

జగన్నాథంగారి ఇంటిముందు ఆగాడు. నిర్మల కిటికీలోనుండి శ్రీధర్‌ను చూసి, మొహం విచ్చిన మందారం చేసుకొని వరండాపైకొచ్చి–, "శ్రీధర్...!" ఆశ్చర్యంగా అంది.

శ్రీధర్, నిర్మలకు తనుతెచ్చిన ప్యాకెట్, బిల్లు అందించాడు నిర్మల ఆ బిల్లును చూసి–, "శ్రీధర్! ఫైనల్ ఎ.జి.బి.యస్సీ చదువుతూ ఇంత విలువ తక్కువ పని చేస్తున్నావా–?" అడిగింది.

"బ్రతుకు కోసం కష్టపడితే తప్పేముంది–?"

"శ్రీధర్! నీవెళ్ళినప్పటినుండి నా మనసేమి బాగు లేదు. నువ్వులేకుండా నేను బ్రతకలేనేమో అనిపిస్తుంది. నీకోసం కాలేజిలో వేయికళ్ళతో వెదుకుతున్నాను కానీ, కనపడకుండా తిరుగుతున్నావు. నిజంగా ఆ చిత్రాన్ని పాడుచేసింది నేను కాదు!"

"మరెవరు–?"

"ఆ రోజు మా అమ్మ అర్ధరాత్రి నీగదిలో వెలుగు చూసి, లోనికి వచ్చిందట నువ్వు మత్తుగా పడుకున్నావట అక్కడ చిందరవందరగా నున్న ఆ రంగులవీ సర్దడంలో కాలు స్టాండుకి తగిలి, చిత్రం రంగుల్లో పడిందట. అసలు దాన్ని గమనించకుండా తీసిచుట్టి టేబుల్ మీద వుంచిందట, అదీ జరిగిన సంగతి. అందుకు యిప్పుడు అమ్మెంతో విచారిస్తోంది. నాన్నగారు పట్టుదల మనిషి!"

"గతించిన దానిగురించి బాధెందుకు, మీ అమ్మ గారేరి–?"

"అమ్మా, నాన్న కలిసి పిక్చర్ కెళ్ళారు!"

"నిర్మలా! యీ వుద్యోగం చేస్తున్నట్టు మా అమ్మకు యే వుత్తరంలోను దయవుంచి తెలియజేయకు!" అని, నిర్మల యిచ్చిన కాఫీ సేవించి వెళ్ళిపోయాడు.

రత్నమ్మకు రాక్షసిలాంటి క్షయవ్యాధితో నిత్యం కళ్ళుకళ్ళుమని దగ్గుతూంది. వెంటనే వూపిరి అందుకోలేక సోలిపోవడం జరుగుతుంది. సాయం చేసే వాళ్ళెవరూ లేరు శ్రీధర్ తప్ప. వొత్తబోయిన కణతలు లోతుగా పోయిన కళ్ళు, వారించుకుపోయిన శరీరంలో ఎముకల చాయలన్నీ బయటకు కనిపిస్తున్నాయి.

శ్రీధర్ ఇంటివద్ద వంటచేసుకొని, తల్లికి వేడినీళ్ళు కాచియిస్తూ టాబ్లెట్ యిచ్చాడు.

రత్నమ్మ ఆవేశపడ్తూ టాబ్లెట్ వేసుకొని, గుక్కెడు నీళ్ళుమింగింది. తల్లికి ధైర్యంచెప్పి, శ్రీధర్ స్నేహితుడింటికి చదువుకునేందుకెళ్తున్నాని, 'బౌన్ ఎంపోరియం'కి చేరుకున్నాడు.

ఆ రోజునుంచి శ్రీధర్‌ను పనిలోకి రావద్దని అప్పటికైన జీతమిచ్చి, మానేజరు పంపించాడు. దీనికి మూలకారణం ఎ.సి.టి.ఒ. జగన్నాథంగారే అనుకున్నాడు శ్రీధర్ మస్తిష్కంలో.

ఆరోజు ఆదివారం. ఇంటివద్ద శ్రీధర్ విచారంగా కూర్చొని ఆలోచిస్తున్నాడు. కొందరు స్నేహితులొచ్చి–, "రారా శ్రీధర్! అలా యేటిఒడ్డుకి షికారుగా పోయివద్దాం!" అన్నారు. అలా తిరిగొస్తే మనశ్శాంతి కలుగుతుందనే వుద్దేశంతో శ్రీధర్ వాళ్ళతో బయల్దేరాడు.

పొలాల గట్లంబడే వెళ్తే యేటిఒడ్డుకు చేరుకుంటారు. మధ్యలోనున్న మనసబుగారి పొలంలో పాలేరు హేండ్ ఆపరేట్ స్ప్రే వీపున కట్టుకొని నాలుగుపొరలతో గూడినగుడ్డ ముక్కుకి కట్టుకొని, గన్‌తో దూరంగా పెట్టినడుస్తూ ఎండ్రిన్ స్ప్రేచేస్తున్నాడు.

దూరంగా పొలంగట్టుపై తువ్వాలు పర్చుకొని మునసబు కూర్చున్నాడు. చుట్టూకొందరు పెద్దమనుష్యులు కూర్చొని మంతనాలు రహస్యంగా జరుపుకుంటున్నారు.

ఆ త్రోవంటే శ్రీధర్, స్నేహితులు వస్తూ, మునసబు పొలంవద్దకొచ్చి, ఆగిపోయారు.

శ్రీధర్, "ఆగిపోయారేం?" అడిగాడు.

"మరోత్రోవంట వెళ్దాం శ్రీధర్?" అన్నాడు అందులో ఒకడు.

"ఇక్కడ వరకు వచ్చి, మరోత్రోవంట వెళ్ళడమేంటి?"

"పొలంలో ఎండ్రిన్ కొడుతున్నారుగదా!"

"ఓస్ అంతేనా! లేక, ఆ పెద్దలకు భయపడా?"

"అదేంకాదు. ఎండ్రిన్ గురించే"

"మీకంత భయమైతే ఎలాగా? మనత్రోవనమనం పోతాం! ఎండ్రిన్ కి మనకు సంబంధమేంటి? యిప్పుడు మరోదారిని వెళ్తే వాళ్ళకు భయపడి వెళ్ళిపోయిన వాళ్ళ మౌతాం!" అన్నాడు.

"నీకలాగే వుంటుంది శ్రీధర్! ఎండ్రినంటే వేళాకోళమనుకున్నావేంటి? మీరలారండి, నేనిలాగే యేటి ఒడ్డుకి చేరుకుంటాను!" అని, నడుస్తున్నాడు. స్నేహితులు వెనుతిరిగి యేటి ఒడ్డుకి మరోత్రోవ తీసారు.

ఈ సంభాషణంతా మునసబు తదితరులు వింటున్నారు. మునసబు నిల్చొని పొలంలో ఎండ్రిన్ కొడుతున్న వెంకన్నను పిలిచాడు. వెంకన్న వెనుతిరిగి చూసాడు. మునసబు చేతితో సైగచేసి, శ్రీధర్ వంక చూపించాడు. ప్రక్క పెద్ద మనుష్యులు కూడ సైగ చేసారు.

శ్రీధర్ ఆ సౌంజ్ఞలను చూసి బెదరిపోరాదనే వుద్దేశ్యంతో అటుప్రక్క పొలంలోకి వంగి నీటిలో తేలుతున్నదేదో తీసి, రుమాల్లో పెట్టుకొని రడీగా ముక్కుకి దగ్గరగా వుంచుకున్నాడు.

వెంకన్న ఎండ్రిన్ ఎక్కువ చిందిస్తూ - శ్రీధర్ నడుస్తున్న గట్టువారగా వచ్చాడు. ఆ వాసనంతా శ్రీధర్ కు సోకుతోంది. శ్రీధర్ ముక్కువద్ద రుమాల్లోవుంచింది గట్టిగా ముక్కుకి వొత్తుకున్నాడు.

పొలం దాటిపోయి యేటిఒడ్డుకు చేరుకున్నాడు. అని మునసబు, మిగిలినవాళ్ళు అనుకున్నారు. ప్రయత్నం ఫలించలేనందుకు చింతించారు.

యేటిగట్టుపై గుబురులుగా పెరిగిన పొదల మాటున సన్నగా మాటలు శ్రీధర్ కు వినిపిస్తున్నాయి...

(సశేషం)

★

# "విమర్శ - ఒక పరిశీలన"

★

"విమర్శ అనేది లేకపోతే! ఏవ్యాధి అయినా గట్టిగా పాతుకపోతూంది. దానిని బాగు చేయడం కష్టం. ధైర్యంగా నిర్మొహమాటంగా చేసే విమర్శ మనవాళ్ళు బాగుపడడానికి సాయమవుతూంది. ముందు కడుగువేసే వుత్సాహం కలిగిస్తుంది. తమపనిలో లోపాలు సరిదిద్దుకునేట్లు చేస్తుంది. విమర్శలేనప్పుడు పాచిపోయి, మురుగు తేలుతూంది. ముందుకు పోయేందుకు దారేవుండదు" —ఎ. ఎ. జదనోవ్.

విమర్శ అనుశబ్దము "వి" అను నుపసర్గముతో గూడిన "మృశ్" ధాతువు నుండి యేర్పడినది. ఆ ధాతువునకు "పరామర్శించుట" "ఆలోచించుట" "పరిశీలించుట" పరీక్షించుట "చర్చించుట" మొదలైన అర్థాలున్నాయి. వీటినన్నింటినీ కలిపిచూస్తే విమర్శ యనగా ఏదైనా ఒక గ్రంథము నందుగాని, కళారూపమునందుగాని అర్థమును బాగుగా పరిశీలించి, దానిని కంఠస్థము చేసి, చర్చించి, అందలి మంచి చెడ్డలను ప్రదర్శించుట యని మనము గ్రహించాలి. విమర్శించునపుడు కేవలము ఒక గ్రంథములోని దోషములనే ఎత్తి చూపుటయని చాలా మంది తప్పుగా అభిప్రాయపడుతుంటారు. గానీ! దోషములతో బాటు మంచి గుణములను గూడా చర్చించ వచ్చును. కొంత మంది విమర్శకులు రచయిత యందలి అభిమానం చేతగానీయండి, దురభిమానంచేత గానీయండి, గుణములను, దోషములుగను, దోషములను గుణములుగను, ప్రదర్శించి